# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

## ముఖ్యాంశాలు

**1.** **దానా తుఫాను నేపథ్యంలో రైలు సేవలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక వార్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.**

**2.** **రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నామని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.**

**3.** **విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు.**

**4.** **అతిసారతో మృతి చెందిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు.**

**5.** **ఈరోజు ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

=============================

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుఫాను ఈరోజు అర్ధరాత్రి నుంచి రేపు తెల్లవారుజాములోపు తీరం దాటే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్రలో వాతావరణం మేఘావృతమై ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని తీర ప్రాంతం వెంట ఈదురుగాలులు వీస్తాయని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

కాగా.. శ్రీకాకుళంలో చేపట్టిన ముందస్తు చర్యలపై తుఫాన్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి బి.వి.ఎస్. ప్రసాద్‌రావు మాట్లాడుతూ..

..వాయిస్.. 25.. సెకన్లు

-------------------------

కాగా.. దానా తుఫాను నేపథ్యంలో తూర్పు తీర ప్రాంతాల్లో రైలు సేవలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక వార్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. తుఫాను ప్రభావిత రైల్వే జోన్ల అధికారులతో దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, భువనేశ్వర్, గార్డెన్‌రీచ్, ఖుర్దా రోడ్, విశాఖపట్నం, సంబల్‌పూర్, చక్రధర్‌పూర్, అద్రా, రాంచీ,

ఖరగ్‌పూర్, బాలాసోర్ డివిజనల్ కార్యాలయాల్లో తొమ్మిది వార్‌రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అన్ని ముఖ్యమైన స్టేషన్లలో వైద్య బృందాలను ఆహార ఏర్పాట్లను చేశామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నామని రాష్ట్ర చేనేత,జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చేనేత కార్యాలయంలో వివిధ జిల్లాల ఉప సంచాలకులతో ఆమె నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చేనేత వస్త్రాలపై వస్తు, సేవల పన్ను–జీఎస్టీని ప్రభుత్వం మినహాయించిందన్నారు. ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా చేనేత కార్మికులకు శిక్షణ ఇచ్చి చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చీరాలలో నూతనంగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలోని సిక్కు గురుద్వారా రహదారి అభివృద్ధి పనులకు ఈ రోజు శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించామని అన్నారు. మురుగునీరు వ్యవస్థ నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని శివనాథ్ తెలుపుతూ...

వాయిస్...24 సెకన్లు

---------------------------

ప్రధాన మంత్రి జన్ మన్ కార్యక్రమం ద్వారా చెంచు గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుకోవాలని నరసరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లాలో పీఎం జన్ మన్ కార్యక్రమం అమలుపై నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబుతో కలిసి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, జిల్లాలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ –ఐటీడీఏ పరిధిలో ఉన్న 6 మండలాల్లోని చెంచులను పథకంలో భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుకోవాలని అన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, జన్ మన్ కార్యక్రమాలను అనుసంధానం చేసి గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 14వ తేదిన ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్ధుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించన్నామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఇందుకు సంబంధించి తల్లిదండ్రులను ఆహ్వానించేందుకు ఆహ్వాన పత్రికను సిద్ధం చేసింది. ప్రధానోపాధ్యాయులు సంతకం చేసి, దీన్ని తల్లిదండ్రులకు పంపిస్తారు. ఈ సమావేశంలో విద్యార్ధుల హాజరు, అభ్యసన సామర్ధ్యాలు, తరగతిలో విద్యార్థి అవగాహన, ప్రవర్తన, పాఠ్యాంశాల వారీగా అభ్యసనను తల్లిదండ్రులకు వివరిస్తారని, బాలికల విద్య, మధ్యాహ్న భోజనం

ప్రాధాన్యం వంటి అంశాలనూ చర్చిస్తారని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

---------------------------

అతిసారతో మృతి చెందిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోరారు. విజయనగరం జిల్లా గుర్లలో మృతుల కుటుంబాలను ఈరోజు పరామర్శించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అతిసార నియంత్రణకు చర్యలు చేపట్టాలని, సురక్షిత త్రాగునీరు సదుపాయాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఇదిఇలా ఉండగా ఈ మధ్యాహ్నం రాష్ట్ర హోం మంత్రి వి.అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గుర్లలో పర్యటిస్తారు.అక్కడి పరిస్థితిని సమీక్షించి, బాధితులతో మాట్లాడనున్నారు.

---------------------------

ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్‌గా పనిచేసేందుకు అభ్యర్ధులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో నివసించే అర్హులైన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో వచ్చే నెల 5వ తేదీలోపు ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి పంపించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440674057 నెంబరును సంప్రదించవచ్చని వెల్లడించారు.

---------------------------

ఈరోజు ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచదేశాల మధ్య మైత్రీ సంబంధాలు పెంపొందించడం, అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడడం, దేశాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం వంటి లక్ష్యాలతో 1945 అక్టోబర్ 24 వ తేదీన ఐక్య రాజ్య సమితి ఆవిర్భించింది. అప్పటి నుండి ప్రతిఏటా ఇదే రోజును ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా పాటిస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ప్రపంచ పోలియో దినాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న

లక్ష్యంతో ప్రతి ఏటా అక్టోబరు 24వ తేదీన ప్రపంచ పోలియో దినాన్ని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు నిర్వహిస్తున్నాయి.

---------------------------

పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ కోరారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మహేష్ కుమార్ మాట్లాడుతూ, మొక్కలు పర్యావరణానికే కాక మానవాళికి మేలు చేస్తాయని తెలిపారు.

---------------------------

కార్తీక మాసంలో కపిలేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని కపిలేశ్వర స్వామి ఆలయాన్ని, పుష్కరిణిని, క్యూ లైన్లను ఆయన నిన్న పరిశీలించారు. ఆలయంలో పారిశుద్ధ్యం, క్యూ లైన్ల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆలయంలో టీటీడీ అందిస్తున్న సౌకర్యాలను గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు.

======================